క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కురుపాం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతున్నట్లు విద్యుత్ శాఖ డీఈ ఎం.రాజేంద్రప్రసాద్ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. పార్వతీపురం నుంచి గుమ్మలక్ష్మీపురం వెళ్లే 33 కేవీ లైన్‌కు తాకే చెట్లకొమ్మల తొలగింపు పనుల నేపథ్యంలో కురుపాం సహా సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఉదయం 8:30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు కరెంట్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు. వినియోగదారులు దీనిని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

ప్రకృతి సేద్యంపై అవగాహన



బురుజోలలో పత్తిలో వేసిన అంతర పంటను పరిశీలిస్తున్న ప్రకృతి వ్యవసాయ అధికారులు

భామిని: మండలంలోని బురుజోల, కొత్తగూడ, ఘనసర గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంబిస్తూ పండిస్తున్న పంటలను జిల్లా ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు అధికారి ఎం.శ్రావణ్‌కుమార్‌నాయుడు శుక్రవారం పరిశీలించారు. అనంతరం అక్కడి రైతులకు ప్రకృతి సేద్యం, వాటి వల్ల కలిగే లాభాలను వివరించారు. ప్రధాన పంటలో అంతర పంటలను సాగు చేస్తే ప్రధాన పంట ఆదాయంతో పాటు అదనపు ఆదాయం వస్తుందన్నారు.

సీతంపేట: ప్రకృతి సేద్యంతో అధిక దిగుబడులు సాధించవచ్చని ప్రకృతి వ్యవసాయం డీపీఎం శ్రావణ్‌కుమార్ అన్నారు. మండలంలోని గొయిది, దిబ్బగూడ, జామితోట గ్రామాల్లోని జీడి, అరటి పంటల్లో అంతర పంటల సాగును ఆయన పరిశీలించి, పలు సూచనలు చేశారు. ప్రతి గ్రామాన్ని బయో గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. అందరూ ప్రకృతి సేద్యం వైపు మక్కువ కనబరచాలన్నారు.

రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం

- బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీలో వైఎస్సార్ సీపీ నాయకులు



సీతంపేట: కూటమి మోసాలను వివరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

సీతంపేట: రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీటీసీ జి.కోటేశ్వరరావు, సర్పంచ్ కె.వెంకునాయుడు విమర్శించారు. మండలంలోని కె.వీరఘట్టం పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న వారు ఇంటింటికీ వెళ్లి, పాలనలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి వర్గానికి చెందిన ప్రజలు కష్టాలు అనుభవిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ హయాంలో అన్ని వర్గాలకు మేలు చేస్తూ సంక్షేమ పథకాలు అందివ్వడం జరిగిందన్నారు. ఇప్పుడు అలా లేదని తమ వారికే పథకాలు అన్నట్లుగా కూటమి నాయకులు, ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. ఎన్నికల హామీలన్నీ అమలు చేయకుండా కాలయాపన చేస్తోందని విమర్శించారు. కొత్త పింఛన్లు కూడా ఇప్పటివరకు ఇవ్వలేదని, పైగా ఉన్న పింఛన్లు కూడా తొలగిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రజలు కూడా గత పాలనకు ఇప్పటి పాలనకు ఉన్న తేడాను గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో వారే తగిన బుద్ధి చెబుతారని హితవు పలికారు. ఎన్నికల హామీలన్నీ అమలు చేసే వరకు ప్రజల తరఫున వైఎస్సార్ సీపీ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో కె.వీరఘట్టం సర్పంచ్ చెంచమ్మ, నాయకులు బి.రూపావతి, జి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- సబ్‌కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్



ఆస్పత్రిని పరిశీలిస్తున్న సబ్‌కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్

పాలకొండ: ప్రభుత్వ ఆస్పత్రుల్లోని రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సబ్‌కలెక్టర్ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ ఆదేశించారు. స్థానిక ఏరియా ఆస్పత్రిని శుక్రవారం సందర్శించిన ఆయన..అక్కడి రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, మందుల నిల్వలు, ఎక్స్‌రే, స్కానింగ్ గదులు పరిశీలించి, పలు సూచనలు చేశారు. ఆస్పత్రి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలని తెలిపారు. రక్తనిధి కేంద్రంలో నిల్వలు లేని కారణంగా ఈ నెల 15వ తేదీన రక్తదాన శిబిరం ఏర్పాటు చేయాలని తెలిపారు.



పాలకొండ రూరల్: పాలకొండ-రాజాం-వీరఘట్టం కూడలి రోడ్డు ఇలా..



పాలకొండ రూరల్: అధ్వానంగా అట్టలినుంచి కురింపేట, బుక్కూరు వెళ్లే రోడ్డు



గుమ్మలక్ష్మీపురం: బురదమయంగా గుమ్మలక్ష్మీపురం వెలుగు కార్యాలయానికి వెళ్లే దారి



భామిని: ధ్వంసమైన నేరడి బ్యారేజ్ సమీపంలోని ఏజీ రోడ్డు

రోడ్లు ఇలా..గమ్యం చేరేదెలా?

రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. ఏ రోడ్డు చూసినా అడుగుకో గుంత..గజానికో గొయ్యి మాదిరి కనిపిస్తున్నాయి. ఇప్పటికే ధ్వంసమైన రహదారులు ఇటీవల కురిసిన వానలకు మరింత ఛిద్రమయ్యాయని, రోడ్ల మీదుగా ప్రయాణం చేయాలంటే నరకం కనిపిస్తోందని వాహనదారులు వాపోతున్నారు. అధికారంలోకి రాగానే అద్దాల్లా మెరిసే రోడ్లు వేస్తామని ప్రగల్భాలు పలికారని, ఇలాగేనా చేసేదని కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా కొత్త రోడ్లు వేయాలని, కనీసం రోడ్డు మరమ్మతులైనా చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

–పాలకొండ, భామిని, గుమ్మలక్ష్మీపురం



భామిని: గుంతలమయంగా గురండి సెంటర్ రోడ్డు



పాలకొండ రూరల్: నవగాం కూడలి నుంచి పొట్లి మీదుగా సింగుపురం వెళ్లే రోడ్డు పరిస్థితి..



గుంతలు పూడ్చిన గురువులు..

ఉపాధ్యాయ దినోత్సవం రోజున పలువురు ఉపాధ్యాయులు స్ఫూర్తినిచ్చే పని చేసి అందరి దృష్టినీ ఆకర్షించారు. రోడ్డు మధ్యలోని గుంతలు పూడ్చి ఆదర్శంగా నిలిచారు. శుక్రవారం పాలకొండ-సీతంపేట రోడ్డులో మార్నింగ్ వాక్‌కు వెళ్లిన వారు ఎన్‌కే రాజపురం సెంటర్ వద్ద రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా ఉన్న గుంతలను చూశారు. ఎవరికీ ఏ ప్రమాదం జరగకుండా రోడ్డు బాగు చేయాలని అనుకున్నారు. అనుకున్నదే తడవుగా రాళ్లు, కంకర, ఇసుక, మట్టి ఇలా అన్నింటినీ గోనెసంచుల్లో తీసుకువచ్చి, గోతుల్లో వేసి సమతలం చేశారు. సదరు గురువులు చేసిన ఈ మంచి పనిని అటువైపుగా వెళ్తున్న వారంతా చూసి మెచ్చుకున్నారు.

–పాలకొండ

కూటమి మోసాలపై నిలదీయాలి

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో వైఎస్సార్ సీపీ నాయకులు

వీరఘట్టం: కూటమి ప్రభుత్వ పాలనా వైఫల్యం, మోసాలపై ప్రతిఒక్కరూ నిలదీయాలని వైఎస్సార్ సీపీ పాలకొండ నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు పొట్నూరు లక్ష్మణరావు, ఇతర వైఎస్సార్ సీపీ నాయకులు పిలుపునిచ్చారు. బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా మండలంలోని తెట్టంగి గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఆయన..ఇంటింటికీ వెళ్లి కూటమి మోసాలను వివరించారు. అధికారంలోకి వచ్చి 16 నెలల కాలం దాటుతున్నా ఎన్నికల హామీలన్నీ అమలు చేయకుండా కాలయాపన చేస్తూ ప్రజలను నిలువునా మోసం చేస్తోందని విమర్శించారు. గతంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదికే అన్నివర్గాలకు మేలు చేస్తూ కుల,మత,రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు ఇవ్వడం జరిగిందని గుర్తు చేశారు. చంద్రబాబు అండ్ కో..ఎన్నికలప్పుడు ఓ మాట, ఇప్పుడో మాట మాదిరి వ్యవహరిస్తున్నారని, ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు బాండులిచ్చి మరీ హామీల అమలుకు తమది గ్యారెంటీ అని చెప్పారని, హామీలు అమలు చేయకుండా ఉంటే మాట్లాడడం లేదని దుయ్యబట్టారు.

–డైవర్షన్ పాలిటిక్స్..

మరోవైపు ప్రజల దృష్టిని మళ్లించేందుకు రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తున్నారని, రెడ్‌బుక్ పేరిట ప్రతిపక్ష నాయకులపై లేనిపోని కేసులు పెట్టి జైలుపాలు చేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఏ వర్గపు ప్రజలకు రక్షణ లేదన్నారు. విద్యార్థులు, మహిళలు ఎక్కడపడితే అక్కడ అత్యాచారాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మైనర్ వర్గాలపై దాడులు ఎక్కువయ్యాయన్నారు. రైతులకు యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. దీని నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్‌కు తెరలేపిందన్నారు. ప్రజలంతా గమనిస్తున్నారని, రాబోయే రోజుల్లో వారే తగిన బుద్ధి చెబుతారని హితవుపలికారు. ప్రజలకు న్యాయం జరిగేంత వరకు వైఎస్సార్ సీపీ తరఫున తమ పోరాటం ఆగదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సతివాడ చిన్నంనాయుడు, పొట్నూరు పరిసినాయుడు, అలజంగి ఏలియా పాల్గొన్నారు.



తెట్టంగిలో కూటమి మోసాలపై ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

'మిలాద్ ఉన్ నబీ' ర్యాలీ



ర్యాలీలో ముస్లిం సోదరులు

కురుపాం: ముస్లింల పండగల్లో ఒకటైన మిలాద్ ఉన్ నబీ పురస్కరించుకుని, మండల కేంద్రంలో ముస్లిం సోదరులు శుక్రవారం ర్యాలీ చేపట్టారు. శివ్వన్నపేట జామియా మసీదు నుంచి మండల కేంద్రం వరకు జరిగిన ఈ ర్యాలీలో మహ్మద్ ప్రవక్త బోధనలు ప్రచారం చేయడంతో పాటు మిలాద్ ఉన్ నబీ పర్వదినం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మహ్మద్ ప్రవక్త జన్మదినం పురస్కరించుకుని చేసుకునే ఈ పండగలో అందరూ భక్తిశ్రద్ధలు కనబరచాలని, మహ్మద్ ప్రవక్త బోధనలు అనుసరించాలని ముస్లిం మతపెద్దలు కోరారు. కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు జిలానీ, నూరెల్లా, ఆదిల్, నిషార్, గౌస్, సుబాని తదితరులు పాల్గొన్నారు.

హిందీ టీచర్‌ను నియమించండి

గరుగుబిల్లి: మండలంలోని పెదగుడబ పంచాయతీ, సన్యాసిరాజు ప్రాథమికోన్నత పాఠశాలకు హిందీ టీచర్‌ను నియమించాలని గ్రామస్తులంతా కోరుతున్నారు. ఇదే పాఠశాలలో ఒకటో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు 105 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా వారికి హిందీ సబ్జెక్ట్ బోధించే ఉపాధ్యాయుడు లేకపోవడంతో విద్యార్థులంతా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల డీఎస్సీ కూడా జరిగిందని, కొత్తగా ఎంపికైన హిందీ టీచర్లలో ఒకరిని గ్రామానికి పంపించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

మొక్కల పంపిణీ



మొక్కలు పంపిణీ చేస్తున్న సర్పంచ్

భామిని: మండలంలోని మణిగ గ్రామంలో గిరిజనులకు శుక్రవారం మొక్కలు పంపిణీ చేశారు. వెలుగు అసోషియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా ఈ మొక్కలు అందిచామని సర్పంచ్ కొండగొర్రి చంటి మంగ తెలిపారు. ప్రతిఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఆయన కోరారు.

గణేశుని లడ్డూ రూ.76,599

కురుపాం: వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని కళింగ వైశ్య సంఘం ఆధ్వర్యంలో గణేశుని లడ్డూ ప్రసాదం వేలం పాట శుక్రవారం నిర్వహించారు. 9 కిలోల 900 గ్రాముల బరువున్న లడ్డూను ఇదే మండల కేంద్రానికి చెందిన చిన్నారి ప్రసాద్, చిన్నారి శ్రీనివాసరావులు రూ.76,599లకు వేలంలో పాడి దక్కించుకున్నారు.

జెడ్పీ చైర్మన్‌కు శుభాకాంక్షల వెల్లువ

పాలకొండ: జెడ్పీ చైర్మన్, వైఎస్సార్ సీపీ విజయనగరం జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు పుట్టినరోజు శుక్రవారం కావడంతో పార్టీ శ్రేణుల నుంచి ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. వైఎస్సార్ సీపీ పాలకొండ పట్టణ అధ్యక్షుడు వెలమల మన్మథరావు సహా కౌన్సిలర్లు అంతా విజయనగరం వెళ్లి జెడ్పీ చైర్మన్‌ను కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేకు కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. కార్యక్రమంలో కడగల రమణ, భాసూరు కాంతారావు తదితరులు ఉన్నారు.



జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి జ్ఞాపిక బహూకరిస్తున్న కౌన్సిలర్లు

కనులపండువగా గణేశుని నిమజ్జనోత్సవం

పాలకొండ: స్థానిక పట్టణంలోని ఏలాం జంక్షన్‌లో కొలువుదీర్చిన వినాయకుడి నిమజ్జనోత్సవం శుక్రవారం కనులపండువగా జరిగింది. ఉదయం పూజలు చేసిన అనంతరం సాయంత్రం విగ్రహ ఊరేగింపు సందడిగా కొనసాగింది. బళ్లవేషాలతో పాటు యువతీ యువకుల నృత్యాలు, మహిళల కోలాటం, గిరిజన సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, తప్పెటగుళ్ల కళాకారుల డ్యాన్స్‌ల నడుమ అనుపపండుగ చూపరులను ఆకట్టుకుంది. ఉత్సవంలో అఘోరాల వేషధారణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



నిమజ్జనానికి తరలిస్తున్న గణేశుడి విగ్రహం



ఆకట్టుకున్న బళ్లవేషాలు



ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన అఘోరాల వేషధారణలు

ఘనంగా గురుపూజోత్సవం



సీతంపేట: సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గిరిజన గురుకుల బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యకుమారి, అధ్యాపకులు



పాలకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రాంతీయ అధికారి శివ్వాల తవిటినాయుడును సన్మానిస్తున్న అధ్యాపకులు

గురుపూజోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అన్ని విద్యాసంస్థల్లో జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కొనియాడారు. సాధారణమైన ఉపాధ్యాయ వృత్తి నుంచి భారత రాష్ట్రపతిగా ఆయన ఎదిగిన విధానాన్ని మనమంతా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఉపాధ్యాయ వృత్తికి ఎంతో వన్నె తెచ్చిన ఆయన జీవితం ఆదర్శనీయమైనదని, ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలని కోరారు. అలాగే అజ్ఞానమనే అంధకారం తొలగించి విజ్ఞానమనే వెలుగును ప్రసాదించేవారు గురువులని వారిని తప్పనిసరిగా గౌరవించుకోవాలన్నారు. అనంతరం ఉపాధ్యాయులను విద్యార్థులను సన్మానించారు.



వీరఘట్టం ఎమ్మార్సీ కార్యాలయంలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈవోలు గౌరినాయుడు, ఆనందరావు

–పాలకొండ, వీరఘట్టం, సీతంపేట, కురుపాం



కురుపాం కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయ సిబ్బంది

నేడు గుడ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన సదస్సు

గరుగుబిల్లి: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌లపై శనివారం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రజని ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా రెండో అదనపు జిల్లా జడ్జి, మండల లీగల్ సెల్ అధ్యక్షులు ఎస్.దామోదర్‌రావు అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపేలా మంచి, చెడు స్పర్శలపై చైతన్యం చేయడం జరుగుతుందన్నారు.

ఆలయాల మూసివేత రేపు

గరుగుబిల్లి: రాహుగ్రస్త చంద్రగ్రహణం కారణంగా మండలంలోని తోటపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి, కోదండరామస్వామి ఆలయాలను ఆదివారం మూసివేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి వీవీ సూర్యనారాయణ ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి ఆలయాలను మూసివేస్తామని, తిరిగి సోమవారం ఉదయం 9:30 గంటలకు ఆలయాలు తెరిచి స్వామి వారి పునఃదర్శనం భక్తులకు కలుగజేస్తామన్నారు.

దశపర్ణి కషాయంతో తెగుళ్లు దూరం



దశపర్ణి కషాయం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: దశపర్ణి కషాయంతో వరి పంటను ఆశించే తెగుళ్లు దూరమవుతాయని ప్రకృతి వ్యవసాయ విభాగం గుమ్మలక్ష్మీపురం యూనిట్ ఇన్‌చార్జ్ కిమిడి భూషణ్ తెలిపారు. మండలంలోని రేగులపాడు గ్రామంలో దశపర్ణి కషాయం తయారీపై శుక్రవారం అవగాహన కల్పించారు. రెండు కిలోల వేపాకులు, 2 కిలోల సీతాఫలం ఆకులు, 2 కిలోల మారేడు ఆకులు, 2 కిలోల బొప్పాయి ఆకులు, 2 కిలోల జామ ఆకులు, 2 కిలోల వావిల ఆకులు, 2 కిలోల జిల్లేడు ఆకులు, 2 కిలోల కాగు ఆకులు, 2 కిలోల ఆముదం ఆకులు, 2 కిలోల మామిడి ఆకులతో పాటు రెండు కిలోల పచ్చిమిర్చి, మరో రెండు కిలోల తెల్లఉల్లిలను 20 లీటర్ల ఆవుమూత్రంతో కలిపి దశపర్ణి కషాయాన్ని ప్రయోగాత్మకంగా తయారు చేసి చూపించారు. ఈ కషాయాన్ని పంటలో పిచికారీ చేసుకుంటే రసంపీల్చే పురుగులు, కాయ, కాండం తొలిచే పురుగులు, లద్దె పురుగు, గొంగళి పురుగులను నివారించవచ్చన్నారు. సర్వ రోగ నివారిణిలా ఈ కషాయం పనిచేస్తుందన్నారు.